క్లుప్తంగా

మంత్రి లోకేష్‌కు, స్పీకర్‌కు కృతజ్ఞతలు

గుంటూరు మెడికల్: తెలుగు నాడు పారా మెడిక్స్ అసోసియేషన్ వినతి మేరకు ఆర్ఎం పీల సమస్యలపై బోర్డు ఏర్పాటు చేస్తామని మంత్రి లోకేష్, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు హామీ ఇవ్వడంపై యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.రవిచంద్ర శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ వైద్యులందరికి ప్రభుత్వ నిర్ణయం శుభ పరిణామమని పేర్కొన్నారు. యువగళంలో లోకేష్ ఇచ్చిన హామీ మేరకు తాము కలిసిన వెంటనే సమస్యలపై స్పందించి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయడం ద్వారా గ్రామీణ వైద్యులకు(ఆర్ఎంపీ)లకు మంచి జరుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రి లోకేష్‌కు స్పీకర్ అయ్యన్నపాత్రుడికి యూనియన్ తరఫున యూనియన్ రాష్ట్ర కార్యదర్శి షేక్ రసూల్, రవిచంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

గుంటూరు రైల్వే స్టేషన్‌లో తనిఖీలు



లక్ష్మీపురం: గుంటూరు రైల్వే స్టేషన్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ బి.నాగ్య శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. తొలుత రైల్వే స్టేషన్‌లోని నూతన ప్లాట్‌ఫాంను పరిశీలించారు. ప్రాంగణంలోని పిట్‌లైన్, రన్నింగ్‌రూమ్, లాబీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అభివృద్ధి పనులు పరిశీలించారు. స్టేషన్ పరిధిలోని ప్రయాణికులకు అందుబాటులోఉన్న వివిధ సౌకర్యాలను పరిశీలించారు. ప్రయాణికుల కల్పించే సౌకర్యాలలో ఎలాంటి లోపం, నిర్లక్ష్యం వహించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే గుంటూరు యార్డు పునరుద్ధరణ పనులు పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఆయన వెంట డివిజన్ సీనియర్ డీఓఎం దినేష్ కుమార్ ఉన్నారు.

హెచ్‌సీసీ వర్సిటీ నుంచి ఎండీ మున్నుకు గౌరవ డాక్టరేట్



గుంటూరు ఎడ్యుకేషన్: సంగడిగుంటలోని జైన్ హైస్కూల్ డైరెక్టర్ ఎండీ మున్ను యూఎస్ఏకు చెందిన హెచ్‌సీసీ యూనివర్సిటీ హైదరాబాద్ క్యాంపస్ నుంచి గౌరవ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈసందర్భంగా శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ ఎండీ మున్ను మాట్లాడుతూ విద్యారంగంలో గత 40 ఏళ్లుగా అందించిన సేవలకు గుర్తుగా గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారని చెప్పారు. తక్కువ ఫీజులతో విద్యను అందిస్తూ ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.

29న శ్రీనటరాజమూర్తి విగ్రహం బహూకరణ

నగరంపాలెం: కూచిపూడి కళాక్షేత్రం కళాశాలకు శ్రీనటరాజమూర్తి విగ్రహాన్ని ఈనెల 29న బహూకరించనున్నట్లు భారత ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షులు బొల్లేపల్లి సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై సోమవారం సాయంత్రం ఆరు గంటలకు శ్రీనటరాజమూర్తి విగ్రహం(నిరాలంబ భంగిమదారు శిల్పం) అందిస్తామని అన్నారు. అనంతరం సాయిమంజీరా కూచిపూడి ఆర్ట్స్ కళాకారులతో కూచిపూడి నృత్య ప్రదర్శనలు జరుగుతాయని పేర్కొన్నారు.

సీఆర్ నగర్ అభివృద్ధికి సహకరించాలి

లక్ష్మీపురం: సీఆర్ నగర్ అభివృద్ధి కుంటుపడిందని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి అన్నారు. శుక్రవారం చంద్ర రాజేశ్వరరావు నగర్ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీనియర్ నాయకులు నూతలపాటి వెంకటేశ్వరరావు, దేవానాయక్, బోసు, హుస్సేన్, బి.నాగలక్ష్మి, నగుల్ మీరా, మౌలాలి, కాసిం పాల్గొన్నారు.

స్పేస్ క్విజ్‌లో విద్యార్థుల ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఇస్రో- షార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పేస్ ఎగ్జిబిషన్‌లో భాగంగా గురువారం నిర్వహించిన స్పేస్ క్విజ్‌లో నల్లపాడులోని బాసరా కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల చైర్మన్ సాదినేని మురళీమోహన్‌రావు, డైరెక్టర్ సాదినేని రాధా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్‌కే సాధిక, ఎస్‌కే సమీర్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి ఇస్రో డైరెక్టర్ ఏ రాజరాజన్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారని పేర్కొన్నారు.

సూర్యఘర్‌తో వెలుగులు

సోలార్ ప్యానల్స్ ద్వారా ఇంట్లోనే విద్యుత్ ఉత్పత్తి

- పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన అమలు
- సబ్సిడీతో పాటు రుణ సదుపాయం కల్పిస్తున్న కేంద్రం
- నెట్ మీటర్‌తో విద్యుత్ ఉత్పత్తి
- వాడకం తెలుసుకునే అవకాశం



ఓ ఇంటిపై సోలార్ ప్యానల్స్

గుంటూరు ఈస్ట్: 'సూర్యుడు మహోద్యమకారుడు.. అలుపెరుగని విప్లవవీరుడు' అని ఓ కవి వర్ణించాడు. నిత్యజీవితంలో సూర్యుడిని చూడకుండ రోజు గడవదు. సహజ వనరులను వినియోగించుకునే విధంగా కేంద్రం పథకాలు ప్రవేశపెట్టింది. అందులో భాగంగా మన ఇంట్లోనే సూర్యరశ్మి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన తీసుకొచ్చింది. అందుకు అవసరమైన మేరకు రాయితీ అందిస్తూ గృహ వినియోగదారులను ప్రోత్సహిస్తోంది.

విద్యుత్ వాడకం మేరకు..

విద్యుత్ వాడకం 300 యూనిట్లలోపు ఉండాలనే నిబంధన ఉంది. అనంతరం ట్రాన్స్‌కో అనుమతులు పొందాక వెండర్లను ఎంపిక చేసుకోవాలి. ఇందులో కిలో వాట్‌కు నిర్ణయిచిన దాని ప్రకారం సబ్సిడీ ఇస్తారు. మిగిలిన మొత్తానికి బ్యాంకు రుణ సదుపాయం కల్పించనున్నారు. చివరగా ఇంటి రూఫ్‌పై వంద చదరపు అడుగుల స్థలంలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం వాడే మీటరు స్థానంలో నెట్‌మీటరు ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా సోలార్ ఉత్పత్తి... వినియోగదారుడు వాడుతున్న విద్యుత్‌ను లెక్కించే అవకాశం ఉంటుంది.

30 రోజుల్లో సబ్సిడీ..

నెట్‌మీటరు అమర్చిన తరువాత పోర్టల్‌లో బ్యాంకు ఖాతా వివరాలు అప్‌లోడు చేయాలి.

పీఎం సూర్యఘర్ పథకం వివరాలు

వినియోగం (యూనిట్‌లలో)	సోలార్ కెపాసిటి (కిలో వాట్‌లలో)	సబ్సిడీ
0–150	1–2	రూ.30 నుంచి రూ.60 వేలు
150–300	2–3	రూ.50 నుంచి రూ.78 వేలు
300లోపు	3	రూ.78 వేలు

దరఖాస్తు ఇలా..

ఈ పథకంలో చేరాలంటే ముందుగా సూర్యఘర్ యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అందులో వివరాలు నమోదు చేసుకోవాలి. ఆరు నెలల కరెంటు బిల్లు కాపీలను జతపరచాలి. తరువాత రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం 30 రోజుల్లో చెల్లిస్తుంది. ఒక కిలో వాట్ రూఫ్‌టాప్ కెపాసిటీ కోసం 3–4 ప్యానల్స్(ఒక మీటరు వెడల్పు, 1.6 మీటర్ల ఎత్తు) అమర్చనున్నారు. కిలో వాట్ సోలార్ రూటార్‌ప్యానల్ నెలకు దాదాపు 125 పై యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. సోలార్ రూటాప్ ప్యానల్స్‌ను సూర్యుడి వేడి పీల్చుకోవడం వల్ల ఇల్లు చల్లగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. వినియోగదారులు పెట్టిన పెట్టుబడి ఆరు నుంచి ఏడేళ్లలో తిరిగి పొందగలరని సోలార్ కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు.

ఇది మంచి పథకం

వినియోగదారులే సోలార్ విద్యుత్ ఉత్పత్తిని చేసుకునే సూర్యఘర్ మంచి పథకం. సోలార్ విద్యుత్ ప్యానల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. రుణ సదుపాయం కల్పిస్తుంది. 6–7 ఏళ్లలో పెట్టిన పెట్టుబడి తిరిగి పొందవచ్చు. నెట్ మీటరు విధానం ద్వారా విద్యుత్ ఉత్పత్తి వాడకం తెలుసుకోవచ్చు. సందేహాలు ఉంటే విద్యుత్ అధికారుల ద్వారా నివృత్తి చేసుకునే అవకాశం ఉంది. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం.

– మురళీకృష్ణ యాదవ్, ఎస్ఈ, సీపీడీసీఎల్

కార్గిల్ విజయం స్ఫూర్తి దాయకం

- గుంటూరు ఎమ్మెల్యేలు మాధవి, నసీర్
- విజయ్ దివస్‌ను పురస్కరించుకుని ఫొటో ఎగ్జిబిషన్



కార్గిల్ ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

లక్ష్మీపురం: కార్గిల్ యుద్ధంలో సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని గుంటూరు పశ్చిమ, తూర్పు ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నసీర్ అహ్మద్ పిలుపునిచ్చారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్(సీబీసీ) ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ 2047 నాటికి అభివృద్ధి పరంగా భారత్‌ను ప్రపంచంలో అగ్రస్థానానికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకోవాలని కోరారు. యువత చిత్తశుద్ధితో కృషి చేస్తేనే లక్ష్యం నెరవేరుతుందని చెప్పారు. దేశ అభివృద్ధికి ఆటంకం కలగకుండా చూసేందుకు సైనికులు ఎన్నో త్యాగాలు చేశారని గుర్తు చేశారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ, విద్యార్థులు జీవిత పరీక్షల్లో విజయం సాధించేందుకు సన్నద్ధతను కొనసాగించాలన్నారు.

జీవితానికి, కార్గిల్ యుద్ధానికి మధ్య ఉన్న సారూప్యతలను వివరిస్తూ, చారిత్రక ఘటనలు భవిష్యత్ తరాలకు కొన్ని పాఠాలను మిగులుస్తాయని అన్నారు. విజయంలో క్రమశిక్షణ, సంసిద్ధత కీలకమని చెప్పారు. ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్.ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ 1999లో కార్గిల్ యుద్ధంలో అధిక ఎత్తులో జరిగిన యుద్ధంలో సైన్యం ఎదుర్కొన్న ఇబ్బందులను వివరించారు. అయితే, భారతదేశం తన ఆయుధాలను మరియు యుద్ధ వ్యూహాలను ఆధునికీకరించి, తిరుగులేని శక్తిగా ఎదిగిందని ఆయన అన్నారు. పీఐబీ, సీబీసీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజిందర్ చౌదరి సరైన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడానికి సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ చేపట్టిన వివిధ కార్యకలాపాలను వివరించారు. ఎమ్మెల్యేలు మాధవి, నసీర్ అహ్మద్ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన కార్గిల్ వీరుల చిత్రాలను సందర్శించారు. కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని వివిధ కళాశాలలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు దేశభక్తి నినాదాలతో ర్యాలీకి నాయకత్వం వహించగా, సీబీసీ ఫీల్డ్ ఆఫీసర్ ఆర్. రమేష్ చంద్ర, ఎన్‌సీసీ అధికారి విజయ్ మోహితే జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం సీబీసీ వివిధ కళాశాలల్లో కార్గిల్ విజయ దివస్ సిల్వర్ జూబ్లీ థీమ్‌పై వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

జిల్లా ఖజానా అధికారికి ఏపీజీఈఏ వినతి



జిల్లా ఖజానా అధికారి బి.రాజగోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీజీఈఏ నాయకులు

లక్ష్మీపురం: పెండింగ్ బిల్లుల మంజూరుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఖజానా అధికారి బి.రాజ్‌గోపాల్‌కు ఏపీజీఈఏ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి కేవీఎస్ శివారెడ్డి మాట్లాడుతూ 15 రోజుల క్రితం పెట్టిన పెండింగ్ బిల్లులు మంజూరు కాలేదని, ప్రధానంగా సిటిజన్ చార్టు ప్రకారం అన్ని లెవెల్స్ కలిపి ఐదురోజులలో మంజూరు కావాల్సి ఉండగా ఇలాంటి పరిస్థితి ఎంటి అని ఆవేదన వ్యక్తం చేశారు. ఖజానా బిల్లులపై వదిలే ప్రసక్తి లేదని అన్నారు. ఉద్యోగ సంఘ నాయకులు వినతిప్రతానికి స్పందించిన జిల్లా ఖజానా అధికారి బిల్లులు పెండింగ్‌లో ఉంటాయని చెప్పడంతో ఉద్యోగ సంఘ నాయకులు అవాక్కయ్యారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులపై సానుకూలంగా స్పందించక పోగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంపై ఉద్యోగ సంఘ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేయాల్సి వస్తుందన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే మంజూరు చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కరీముల్లా షా ఖాదిరి, నగర శాఖ అధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు మురళీ, నగర కోశాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్గిల్ యుద్ధ వీరులను స్మరించుకుందాం



మాట్లాడుతున్న మేజర్ విజయ్ మహతి



మాట్లాడుతున్న జవాన్ కొత్తపల్లి టైటాస్

గుంటూరు ఎడ్యుకేషన్: సైనికునిగా దేశ రక్షణలో కలిగే సంతృప్తి మరెక్కడా ఉండబోదని 25 ఎన్‌సీసీ ఆంధ్ర బెటాలియన్ సుబేదార్ మేజర్ విజయ్ మహతి పేర్కొన్నారు. శుక్రవారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలను నిర్వహించారు. విజయ్ మహతి మాట్లాడుతూ కార్గిల్ వీరులను స్మరించుకోవాలని సూచించారు. సుబేదార్ మేజర్ సాగర్ పటేల్ మాట్లాడుతూ అమరులైన సైనికులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్, ఎన్‌సీసీ అధికారి పి.కుమార్ రాజా, ఎన్ఎస్ఎస్ అధికారి ఆర్. జయశైలజ పాల్గొన్నారు.

హిందూ కళాశాలలో..

సైనికుల త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ సింగరాజు వెంకటరమణ పేర్కొన్నారు. శుక్రవారం అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలను నిర్వహించారు.

కార్గిల్ యుద్ధంలో పాల్గొనడం గర్వంగా ఉంది

నెహ్రూ నగర్: కార్గిల్ యుద్ధంలో పాల్గొనడం ఎంతో గర్వంగా ఉందని కార్గిల్ యుద్ధ జవాన్ కొత్తపల్లి టైటస్ పేర్కొన్నారు. శుక్రవారం కార్గిల్ విజయ దివస్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని స్థానికైనా ఒకరు స్థానిక నెహ్రూ నగర్ లోని ఆక్స్ ఫర్డ్ హైస్కూల్‌లో వేడుకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకొని ముందుకు సాగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ డి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి

గుంటూరు సైనిక బోర్డు డైరెక్టర్ వెంకటరెడ్డి



గుంటూరు ఎడ్యుకేషన్: దేశ సేవ చేయడం అంటే సైన్యం చేరడమే కాకుండా నచ్చిన రంగంలో రాణిస్తూ దేశానికి సేవ చేయవచ్చునని సైనిక బ్రిగేడియర్, విశిష్ట సేవా చక్రగ్రహీత, గుంటూరు సైనిక బోర్డు డైరెక్టర్ వి.వెంకటరెడ్డి పేర్కొన్నారు. కలెక్టర్ బంగ్లారోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో శుక్రవారం 25వ కార్గిల్ విజయ దివస్ సందర్భంగా భారత సైనికుల సేవలను స్మరించుకున్నారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఉత్తమ విలువలను, దేశభక్తి భావాలను పెంపొందించే కార్యక్రమాలను నిర్వహిస్తూ, వారిని మేటి పౌరులుగా తయారు చేయడంలో భారతీయ విద్యాభవన్ తన వంతు పాత్ర పోషిస్తోందన్నారు. అనంతరం విద్యార్థులు సైనికుల వేషధారణతో దేశభక్తి గీతాలకు నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి పి. రామచంద్రరాజు, ప్రిన్సిపాల్ హేమాంబ, ప్రధానోపాధ్యాయురాలు కృష్ణ ఉషశ్రీ పాల్గొన్నారు.

బీకాం ఫలితాల్లో శ్రీమేధ-కెరీర్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అన్నా నందకిషోర్

గుంటూరు ఎడ్యుకేషన్: ఏఎన్‌యూ గురువారం ప్రకటించిన బీకాం ద్వితీయ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో శ్రీమేధ-కెరీర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు జనరల్, కంప్యూటర్స్ కోర్సుల్లో అత్యధిక మార్కులతో పాటు అధిక ఉత్తీర్ణత శాతాన్ని సాధించారని సంస్థ డైరెక్టర్లు శేష సాయిబాబు, అన్నా నందకిషోర్ తెలిపారు. బ్రాడీపేట 2/9లోని కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బీకాం జనరల్ విభాగంలో టి.ఒలీవ్ గ్లోరియానా 700 మార్కులకు గాను 619, షేక్ సుమయా 612, జె.మౌని సృజన 599, రితిక కుమారి 584, వి.నరేష్‌కుమార్ 582 వంటి టాప్ మార్కులు సాధించారని వివరించారు. బీకాం కంప్యూటర్స్‌లో బి.షారోనికా 800 మార్కులకు గాను 714, పి.ఆర్షియా 678, ఎ.మహేశ్వరి 659, ఎన్.స్తుతి హర్షిత 654, షేక్ క్యూబా హౌసైన్ 646 మార్కులు సాధించారని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను అన్నా నందకిషోర్, శేషసాయిబాబు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

రామాయణంపై ఆధ్యాత్మిక ప్రవచనం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శుక్రవారం సంక్షిప్త రామాయణంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త కె.వి.కోటేశ్వరరావు ప్రసంగిస్తూ రామలక్ష్మణులు మాతంగాశ్రమంలో వింతలను తిలకించారని అన్నారు.

ఉ.సా. చిరస్మరణీయుడు



ఉ.సా. చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



ఉ.సా. చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రజక సంఘ నాయకులు

నెహ్రూనగర్: ఉద్యమాల ఉపాధ్యాయులు ఉప్పుమావులూరి సాంబశివరా(ఉ.సా) అని ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు పేర్కొన్నారు. ఉసా వర్ధంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ జేఏసీ ఆధ్వర్యంలో నాట్కో ఫార్మా, శ్రీ ప్రతిమ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో క్షవర వృత్తిదారులకు ఉచిత వైద్యశిబిరంలో రామిరెడ్డితోటలో శుక్రవారం నిర్వహించారు. నరసింహారావు మాట్లాడుతూ ఉ.సా. ఆశయాలను నేటి యువత ముందుకు సాగించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ ఉ.సా. ఒక గొప్ప సిద్ధాంతకర్త, ఉద్యమ నేత అని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఆయన చూపిన బాటలో నడవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు బి.సాయి కృష్ణా, గార్లపాటి శివ శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

పేద వర్గాల పక్షాన నిలబడిన మహోన్నత వ్యక్తి ఉ.సా.

నెహ్రూనగర్: కమ్యూనిస్ట్ భావజాలంతో తన జీవితాంతం పేద వర్గాల పక్షాన నిలబడి వారి రాజ్యాధికారం కోసం కృషి చేసిన మహనీయుడు ఉప్పుమావులూరి సాంబశివరావు(ఉ.సా) అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవా సంఘ ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఉ.సా. వర్ధంతిని పురస్కరించుకుని పాతగుంటూరు గంగానమ్మ కమ్యూనిటీ హాల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాల ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ఆహర్నిశలు శ్రమించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఈమని ఉమామహేశ్వరరావు, లింగాల భిక్షం, వట్టికూడి సాంబయ్య, సురేష్‌బాబు, రాంబాబు, నరసింహారావు పాల్గొన్నారు.

చేనేతల ఆరాధ్య దైవం ప్రగడ కోటయ్య

నెహ్రూనగర్: చేనేతల ఆరాధ్య దైవం ప్రగడ కోటయ్య అని రాష్ట్ర వీవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు విన్నకోట వెంకటేశ్వరరావు(కన్నా మాస్టార్) పేర్కొన్నారు. కోటయ్య జయంతిని పురస్కరించుకుని గుజ్జనగుండ్లలోని ప్రగడ కోటయ్య చేనేతల భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యనంతరం యాంత్రీకరణ ద్వారా దేశంలోని కోట్లాది మంది చేనేత కార్మికుల జీవితాలు దుర్భరమైన పరిస్థితుల్లో స్వాతంత్ర్య సమరయోధునిగా, రాజ్యసభ సభ్యునిగా ప్రగడ కోటయ్య పార్లమెంట్ ద్వారా అనేక చట్టాలు చేయించి చేనేత పరిశ్రమ నిలదొక్కుకోవడానికి అవిరళ కృషి చేశారని చెప్పారు. పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ నగర అధ్యక్షులు కోట సత్యం మాట్లాడుతూ చేనేత హక్కుల కోసం తన గళాన్ని వినిపించిన కోటయ్య ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ పడవల రఘురామ్, జాయింట్ సెక్రటరీ గోలి వెంకటేశ్వర్లు, ట్రెజరర్ అందె శ్రీనివాసరావు, వంగర ఏడుకొండలు, మాచర్ల వీర రాఘవయ్య, మాజీ కార్పొరేటర్ ఉడతా కృష్ణ, ఉడతా నాగేశ్వరరావు, ఏనుగుల శ్రీను, వింజమూరి పార్థసారథి, చిలువేరు సత్యనారాయణ, గుంటి నరసింహారావు పాల్గొన్నారు.

నైపుణ్యాలతో కూడిన విద్యాబోధన చేయాలి

డీఈఓ పి.శైలజ



ఉపాధ్యాయులతో సమావేశమైన డీఈఓ శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: కాలానుగుణంగా నైపుణ్యాలతో కూడిన విద్యా బోధన చేయాలని డీఈఓ పి.శైలజ అన్నారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్ష సప్తాహ్‌లో భాగంగా శుక్రవారం కొత్తపేటలోని జలగం రామారావు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. ఈసందర్భంగా శిక్ష సప్తాహ్ షెడ్యూల్‌లో భాగంగా సాంకేతిక నైపుణ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులతో డీఈఓ శైలజ వేర్వేరుగా మాట్లాడారు. విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. డిజిటల్ తరగతుల ద్వారా బోధన సాగించడంతో పాటు విద్యార్థులను భావి సాంకేతిక ఇంజినీర్లుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని అన్నారు. అనంతరం పీఎం పోషణ్ ఆహార పదార్థాల నాణ్యత పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

గుంటూరు ఈస్ట్: పూల, పండ్ల మార్కెట్ పరిసర ప్రాంతాల్లో స్థానికుల సహాయంతో సీసీ కెమెరాలు శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా లాలాపేట ఎస్‌హెచ్‌ఓ దేవ ప్రభాకర్ మాట్లాడుతూ నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమన్నారు. నేరం జరిగితే నిందితులను పట్టుకునేందుకు సీసీ ఫుటేజీలు ఉపయోగపడతాయని చెప్పారు. అన్ని ప్రాంతాల్లో స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

సెల్ దుకాణంలో చోరీ

గుంటూరు ఈస్ట్: సెల్‌ఫోన్ షాపులో చోరీ ఘటనపై పాతగుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. సుద్ధపల్లి డొంకలోని సచివాలయం సమీపంలో మానస సెల్‌షాపులో గురువారం రాత్రి చోరీ జరిగింది. షాపు యజమాని జానీబాషా శుక్రవారం షాపు పరిశీలించి రూ.లక్ష విలువైన సెల్‌ఫోన్లు, రూ. 60 వేలు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవనంపై నుంచి కిందపడి వ్యక్తి మృతి

గుంటూరు ఈస్ట్: భవనంపై నుంచి కిందపడి ప్లంబర్ మృతిచెందిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ఏటీఅగ్రహారం 4వలైనులో మేడికొండూరు మండలం సిరిపురానికి చెందిన రాంబాబు(40) పనులు చేస్తూ శుక్రవారం ప్రమాదవశాత్తు రెండో అంతస్తు నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని జీజీహెచ్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అమరావతి బౌద్ధ స్థూపాన్ని సందర్శించిన విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిలోని చారిత్రక బౌద్ధ స్థూపంతో పాటు అమరేశ్వరస్వామి దేవస్థానాన్ని శుక్రవారం గుంటూరులోని హిందూ కళాశాల విద్యార్థులు సందర్శించారు. ఇన్‌టాక్ సంస్థ ఆధ్వర్యంలో అమరావతి మ్యూజియంతో పాటు పంచారామ క్షేత్రాల్లో ఒకటైన అమరేశ్వరస్వామి దేవస్థానాన్ని సందర్శించిన విద్యార్థులు అక్కడి చారిత్రక విశేషాలు, పురాతన చరిత్రను తెలుసుకున్నారు. ఇన్‌టాక్ జిల్లా కన్వీనర్ ఏ రవి శ్రీనివాస్, సీతారమేష్, అడపా వేణు, విజయ్‌కుమార్, పురావస్తు పరిశోధకుడు శ్రీనాథ్‌రెడ్డి, హిందూ కళాశాల చరిత్ర శాఖ అధ్యాపకుడు చెన్నయ్య, వేంకటేశ్వరరావు ఉన్నారు.